# జ్వలించే పాదాలు

## దళిత ఉద్యమం పై ఒక అధ్యయనం

డి. ఆర్. నాగరాజ్

తెలుగు సేత

సి. మృణాళిని

ఎమెస్కో

## విషయసూచిక


**ఉపోద్ఘాతం** 11

**జ్వలించే పాదాలు** 13

**I. సాంస్కృతిక రాజకీయాల్లోని అంశాలు: చారిత్రకాలు, సమకాలీనాలు**

1. ఆత్మ ప్రక్షాళనమా, ఆత్మాభిమానమా? 15
2. దళితులపై హింస – గ్రామాల అంతర్ధానం 47
3. సాంస్కృతిక స్మృతి నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలు 62

**II. సాహిత్యంలో చిహ్నాలు, అలంకారాలు**

4. సామాజిక ఆగ్రహం, ఆధ్యాత్మిక అన్వేషణలకు మధ్య 75
5. కులాలు, వాస్తవిక వాదం, దళిత భావోద్వేగాలు,
   కన్నడ నవలల ప్రపంచం 80
6. కన్నడ కల్పనాసాహిత్యంలో సామాజిక పరిణామం:
   దళిత, దళితేతర ఉత్కృష్ట రచనల తులనాత్మక అధ్యయనం. 87

అధ్యాయం 1

# ఆత్మ ప్రక్షాళనమా, ఆత్మ గౌరవమా దళిత ఉద్యమం పునాదులు

'ఒక దానితో ఒకటి సంవదించని పడని రెండు ఆదర్శాలు కలిస్తే, ఎవరికి వారు రెండో వారిని మూర్ఖులుగానూ, విద్రోహులుగానూ పరిగణిస్తారు'

('ఆన్ సర్టైనిటీ' లో విట్ గెన్ స్టెయిన్)

## I

ఈ పుస్తకాన్ని, డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ని విమర్శనాపూర్వకంగా తలచుకోవడంతో ప్రారంభించడం ఉత్తమమైన పని. ఎందుకంటే తథాగతుడు నేర్పిన బౌద్ధ విధానం, గురువుగారినే విమర్శించడంలో గట్టిది. ఎలా చూచినా దళిత ఉద్యమం ఉనికే బాబాసాహెబ్ మీద ఆధారపడింది; అదే సమయంలో ఇప్పుడు ఈ ఉద్యమం ఎదుర్కొంటున్న సంక్షోభం కూడా అతని పితృత్వం వల్ల సంక్రమించినదే. ఆయన తాత్విక జీవితాన్ని, రాజకీయ జీవితాన్ని విమర్శనాపూర్వకంగా అంచనా వేయడంద్వారా ఈ ఉద్యమాన్ని సరయిన సందర్భం నుంచి చూసి, దానిపై వెలుగులు ప్రసరింపజేయవచ్చు.

వింతల్లో వింత బాబాసాహెబ్ రాజకీయ జీవిత స్వభావాన్ని అర్థం చేసుకోవాలంటే దాన్ని గాంధీజీ జీవితంతో సమాంతరంగా పరిశీలించాలి. ఎందుకంటే ఈ రెండిటి మధ్య ఉన్న వైరుధ్యం అంబేద్కర్ ఎదుర్కొన్న అసాధారణ సమస్యలను మనకు తేటతెల్లం చేస్తుంది. వీరిద్దరి మధ్య వైరుధ్యం నిజమైనదీ, మౌలికమైనదీనా? ఈ ప్రశ్నకు వీలయినంత సత్యసంధతతో జవాబు చెప్పడానికి ప్రయత్నిస్తాను. ఈ సమాధానం దళిత ఉద్యమానికి సంబంధించినంత వరకూ సుదూర ఫలితాలనిస్తుంది కనుక, జాగ్రత్తగా, ఎప్పటి నుంచో పాతుకు పోయిన అకారణ అయిష్టతలనూ, పొంతన లేని ఆశలనూ కూడా ప్రతిఘటిస్తూ సమాధానం వెతుక్కోవాలి. మరో విధంగా చెప్పాలంటే, దళిత ఉద్యమం పుట్టడమే, అస్పృశ్యతా నివారణకు గాంధీజీ చూపిన నమూనాను తిరస్కరించాలన్న మానసిక స్థితి నుంచి పుట్టింది. అదే దాని వస్తురూపాల ఆకృతులను నిర్దేశించింది. అయితే ఇప్పుడు చారిత్రకంగా ఎన్నో మార్పులు వచ్చాయి. దీనివల్ల ఈ ఉద్యమాన్ని శాసించిన దాని మూలం, నిర్మాణాలను మనం పునః పరిశీలించవలసిన అవసరం ఏర్పడింది.

ఈ ప్రయత్నంలో మనకు అయిష్టమైన ఫలితం ఎదురయినా సరే, దాన్ని భరించక తప్పదు. ఎందుకంటే మనం ఇంతవరకు గుర్తించని కొన్ని అనురూపతలను ఇప్పుడు ఆమోదించవలసి రావచ్చు.

ఉదాహరణకు, గాంధీజీ, అంబేద్కర్‌ల అనుబంధానికి సంబంధించి ఇప్పటికే ఆమోదింపబడిన కొన్ని అభిప్రాయాలను పరిశీలిద్దాం. మనం దీని వల్ల సంకుచిత భావనలకు లోనయ్యామన్న విషయం మనకు తెలుసును కనుక, ఈ పరిశీలన చాలా జాగ్రత్తగ చేయాల్సివుంటుంది. 1947 వరకు దేశాన్ని శాసించిన గాంధీజీ సిద్ధాంతాలు, రాజకీయ సంస్కృతుల కంటే బాబా సాహెబ్ రాజకీయాలు కచ్చితంగా భిన్నమైనవి. దేశ రాజకీయాలకు గాంధీ కేంద్రబిందువు; ఆయనతో విభేదించిన వారు – చాలా మంది ఉండేవారనుకోండి – విచిత్రమనస్తత్వం కలవారిగా పరిగణింపబడేవారు. ముఖ్యంగా హరిజన సమస్యకు సంబంధించి గాంధీ చూపిన నమూనాను లోతుగా పరిశీలించవలసివుంది. 1960 దశకంలోనూ, ఆ తర్వాత కాంగ్రెస్– హరిజన సంబంధాలపై ఉవ్వెత్తున లేచిన యువకుల నిరసన నేపథ్యంలో ఈ విషయాన్ని మనం మరోసారి అధ్యయనం చేయాల్సివస్తుంది. గాంధీజీ సృష్టించిన హరిజన నాయకత్వం అతన్ని పోలివుండేది కాదు; ఆయన తర్వాతి నాయకులను తయారు చేసిన రాజకీయ, మానసిక పరిస్థితులు మరో కొత్త రకమైన జాతీయవాద రాజకీయ అభివ్యక్తికి జన్మనిచ్చాయి. అదే సమయంలో సామాజిక సాంస్కృతిక ప్రశ్నల మీద మాత్రం వీరు మౌనం పాటించారు. అంటే ఏక కాలంలో ఒక దానిపై మాటలు, రెండో దానిపై మౌనం. స్వాతంత్ర్యానంతర దశకాల్లో, కొత్త దళిత తరాల యువకులు, తమ సీనియర్ హరిజన నాయకుల జాతీయవాద ప్రకటనలను జాతీయవాద చెత్తగా అభివర్ణించారు; వీరు సమాజ నిర్మాణంలోనే ఉన్న వివక్షను విస్మరించారనీ, సంస్కృతిపై వారి మౌనం ఆధిపత్యానికి లొంగిపోవడమనీ, పిరికితనమనీ వీరు పేర్కొన్నారు. అయితే చరిత్రలోని సామాజిక, సాంస్కృతిక ఉద్యమాల్లో మామూలుగా జరిగినట్లుగా, తమ పూర్వ తరాల వారి ఉద్యమ సంప్రదాయాన్ని వీరు కావాలనే అపార్థం చేసుకున్నట్టు ఈవిషయంలో భావించలేం. ఈ సందర్భంలో మాత్రం పూర్వీకుల 'హత్య' న్యాయమూ, అనివార్యమూ అని ఒప్పుకోక తప్పదు. ఈ సీనియర్ హరిజన్ నాయకుల మీద విమర్శ మరీ కటువుగా ఉందనీ, ఆనాడు వారి అభిప్రాయాలను ప్రభావితం చేసిన సంక్లిష్ట చారిత్రక శక్తులను సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారని భావించవచ్చునా? అని అనుమానం వస్తుంది.

చరిత్రలోని ఆకర్షణే అది; ఒకరినేమో సంకుచిత దృక్పథమే సమగ్ర దృక్పథమని ఒప్పిస్తుంది; మరొకరిని ఆవేశపూరితమైన కార్యాచరణకు ఉసికొల్పుతుంది. సమగ్ర దృక్పథం కోసం వేచి చూసేవాడు ఎప్పటికీ చరిత్రలో ఏ కార్యాచరణా చేయలేడు. **చరిత్రలోని ప్రత్యేకత ఇదే.** అటు బాబా సాహెబ్, ఇటు బాపూజీ ఇద్దరూ అలాంటి సృజనాత్మకమైన అసహనంతో చరిత్రలోకి దూకడం వల్లే ఇద్దరి మధ్యా ఘర్షణ తప్పలేదు. ఇలాంటి సృజనపరుల మహా సమాధిస్థితి

చరిత్రాత్మక చర్యలకు దారితీస్తుంది; ఇలా ఇద్దరూ కార్యాచరణలోకి దూరి, ఒకరి మితిమీరిన తనాన్ని మరొకరు నియంత్రించారు; ఈ గాఢమైన పరస్పర సంబంధం నుంచి ఇద్దరూ మారిన మనుషులుగా రూపొందారు. నేను ఇప్పుడు మాట్లాడుతున్నది 1930 దశకంలో గాంధీజీ, అంబేద్కర్ ల సంక్లిష్టమైన, ఆకర్షణీయమైన కలయిక గురించి. వీరిద్దరూ ఒకర్నొకరు 'మూర్ఖుడి'గా, 'విశ్వాసరహితుడి'గా పేర్కొన్నప్పటికీ (అవే పదాలను వాడకున్నా) వీరి అనుబంధంలోని ప్రత్యేకత మాత్రం వాస్తవం. ఇద్దరిలో బాబాసాహెబ్ స్పందనలోనే ఆగ్రహం అధికం. కాకపోతే ఇది కేవలం తన నుంచి ఇటువంటి స్పందనను ఆశించేవారి కోసం బాబాసాహెబ్ అవలంబించిన వైఖరేమో అనిపిస్తుంది. 30 దశకం గడిచే కొద్దీ, అంతకు ముందున్న బాబాసాహేబ్, గాంధీల సంబంధంలో చాలా మార్పు వచ్చింది. ఇద్దరూ ఒకరి వల్ల మరొకరు గాఢంగా ప్రభావితులయ్యారు. ఈ విషయాన్ని మరింత సమీపం నుంచి పరిశీలిద్దాం. మొత్తం కథను వివరించను కానీ, ప్రధాన సన్నివేశాలను మాత్రం వర్ణించడానికి ప్రయత్నిస్తాను. ఇప్పుడు చెబుతున్నదానికి ఆధారం, హరిజన్ వారపత్రికనుంచి స్వీకరించిన విషయాలు; ముఖ్యంగా 1933-1936 మధ్య హరిజన్ పత్రికలో వచ్చిన విషయాలు నిజంగానే ఒక ఇతిహాస ప్రమాణంలో ఉన్నవి; ఆ వ్యాసాల వైవిధ్యం ప్రక్రియా పరంగా అద్భుతమైంది. (ఇక్కడ ప్రక్రియ అంటే సాహిత్య ప్రక్రియలనే సంకుచితార్థంలో కాదు జీవితానుభవాలు తమ పరిమితులను అధిగమించి, అవే సాహిత్య ప్రక్రియగా మారిపోవడం.)[1]

గాంధీజీ ప్రధాన లక్ష్యాల్లో అస్పృశ్యత నివారణ ఒకటి. అంతకు ముందు, అంటే 18, 19 శతాబ్దుల్లో ఎందరో యోగులు, ఎన్నో ఉద్యమాలు ఈ విషయాన్ని పట్టించుకున్నా, తొలిసారి అస్పృశ్యతను రాజకీయ సమస్యల్లో అతి కీలకమైనదిగా గుర్తించిన వ్యక్తి బాపు అని అంగీకరించక తప్పదు. ఈ యోగులు, వీరి ఉద్యమాల కృషిని మరింత లోతుగా విశ్లేషించవలసివుంది. మొత్తం మీద చూస్తే, 19 వ శతాబ్దిలోని భారతీయ సమాజంలో చెలరేగిన సంక్షోభం ఏకకాలంలో వర్ణ వ్యవస్థను ప్రశ్నించే సామాజిక ఉద్యమాలను, మత పరమైన ప్రతీకాత్మకతను సృష్టించింది. ఈ ఉద్యమాలను, కార్యకలాపాలను కల్పించిన యంత్రాంగాలు భారత దేశానికి, పశ్చిమ దేశాలతో ఉన్న సమస్యాత్మక సంబంధం నుంచి మాత్రమే ఉద్భవించినవి కాదు; కొన్ని పరిణామాలు ఈ సంబంధాల వల్ల వచ్చినవే అయినప్పటికీ.[2]

చారిత్రకంగా చూస్తే, ఎందరో దేశీయమైన యోగులు, సాధువులు, వర్ణ వ్యవస్థలోని హెచ్చు తగ్గులను గట్టిగానే వ్యతిరేకించారు. వీరికి, ఒక తాత్కాలికమైన దశగా గానీ, ఒక ఘర్షణా భరితమైన స్థితిగాగానీ వలస వాదమంటే ఏమిటో తెలీదు. దీనికి ఉదాహరణలుగా కర్ణాటకకు చెందిన శిశునాలా షేరీఫ్, కైవారా నారాయణప్ప అనే యోగులను, ఉత్తర భారతంలోని సత్నమీలు, మహిమా ఉద్యమ కారులను చెప్పుకోవచ్చు.